క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రొంపిచెర్ల: రొంపిచెర్ల మోడల్ స్కూల్‌లో 2023-24 సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సరళ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 01.09.2011 నుంచి 31.08.2013 మధ్యలో జన్మించి ఉండాలన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థులు 01.09.2009 నుంచి 31.08.2013 మధ్య పుట్టి ఉండాలన్నారు. దరఖాస్తు రుసుం ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 చెల్లించాలన్నారు. ఈ నెల 10 నుంచి 25వ తేదీల్లోపు httpr://apmr.ap.gov.in.apmr ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

చర్చిలో వేసవి తరగతులు



కల్లూరు చర్చిలో చిన్నపిల్లలతో పాస్టర్ ధనరాజ్

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు బీసీ కాలనీలోని చర్చిలో చిన్న పిల్లలకు వారం రోజులపాటు వేసవి తరగతులు నిర్వహించినట్లు పాస్టర్ ధనరాజ్ తెలిపారు. వేసవి తరగతుల్లో పిల్లలకు చదువుకునే పద్ధతులు, వివిధ క్రీడలు, పెద్దలతో మెలిగే విధానం నేర్పించామన్నారు. అనంతరం పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ సోనీథామస్, సంతోష్‌కుమార్, కోదండరామయ్య, సుశీల, టైటస్, చెంగల్రాయులు పాల్గొన్నారు.

13న కల్యాణోత్సవం

సదుం: మండలంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో ఈనెల 13న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 12 గంటలకు కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఊరేగింపు ఉంటుందని చెప్పారు. భక్తులకు ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్‌ఐకు సన్మానం



ఎస్‌ఐను సన్మానిస్తున్న నేతలు

పెద్దపంజాణి: పెద్దపంజాణి మండల నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును మండలానికి చెందిన దళిత నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. మాల మహానాడు మండల అధ్యక్షుడు మంజునాథ్, అమరనారాయణ, తిప్పన్న, రంగప్ప, రెడ్డెప్ప, ఎల్లప్ప, క్రిష్ణప్ప పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన



పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

పలమనేరు: జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో సాగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పుస్తక పఠనంపై స్థానిక గ్రంథాలయాధికారి హేమంత్‌కుమార్ ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పుస్తక పఠనంపై విద్యార్థులకు పోటీలను నిర్వహించి వారికి బహుమతులుగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఈనెల 11 దాకా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

అడిషనల్ క్వాంటమ్‌ను చెల్లించాలి



పెన్షనర్ల సమావేశం

పలమనేరు: అడిషనల్ క్వాంటమ్‌ను అదే నెలలో చెల్లించాలని స్థానిక పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పెన్షనర్ల సంఘ కార్యాలయంలో ఆదివారం సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు ప్రభుత్వం అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ కొలుపు

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మ అమ్మవారి కొలుపు మహోత్సవం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఉదయం అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహిళలు ప్రతి ఇంటి నుంచి అంబలి, పాలు, పసుపు నీటి బిందెలతో గ్రామంలో మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అర్చకులు మహిళలు తెచ్చిన పాలు, పసుపు నీటితో అమ్మవారిని అభిషేకించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారిని వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులకు అంబలిని పంపిణీ చేశారు. అమ్మవారి కొలుపు మహోత్సవానికి తమిళనాడు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల భక్తులు భారీగా రావడంతో ఆలయం కిటకిటలాడింది.

ఏమారితే గంగపాలే!

- గుంతల్లో ఈతకు దిగి ప్రాణాలు పోగొట్టుకుంటున్న వైనం
- నిర్లక్ష్యంతో నీట మునిగిపోతున్న బతుకులు
- వేసవి సెలవుల్లో ఇళ్లల్లో ఉండని పిల్లలు
- తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త



పలమనేరు సమీపంలోని గుంతలో ఈత కొడుతున్న పిల్లలు

పలమనేరు: గత కొన్నాళ్లుగా పలమనేరు నియోజకవర్గంలో బావులు, చెరువుల్లో పడి పలువురు చిన్నారులు మృత్యువాతపడుతున్నారు. వేసవి సెలవుల్లో సరదా కోసం ఈతకెళ్లే పిల్లలు పొరపాటున నీటిలో దిగి మృత్యువాతపడుతున్నారు. గత మార్చి నెలాఖరున బైరెడ్డిపల్లి మండలంలోని కోట్రేపల్లి కొండ కోనేటిలో మునిగి ముగ్గురు బాలికలు మృతి చెందారు. తాజాగా ఈ నెలలో ముగ్గురు ఈత సరదా కోసం వెళ్లి బావుల్లో నీటమునిగారు. తల్లిదండ్రులు పిల్లలపట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొంపముంచుతున్న ఈత సరదా...

పిల్లల బడులకు సెలవులు కొనసాగుతున్నాయి. అయితే పిల్లలు పట్టణ సమీపంలోని చెరువుల్లోని గుంతలు, వాగులు, కీలేరిలోని బావుల్లో ఈతలకు వెళుతున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రమాదాలు తప్పని పరిస్థితులున్నాయి. ఇళ్లల్లోనే ఉండమని తల్లిదండ్రులు ఎంతచెప్పినా పిల్లలు ఏమాత్రం ఖాతరు చేయకుండా సరదాగా స్నేహితులతో కలిసి బయటకు వెళుతున్నారు. దీంతో తల్లిదండ్రులకు ఆందోళనలు తప్పడంలేదు. పిల్లల వినోదం కాస్త విషాదంగా మారిన ఎన్నో సంఘటనలు ఈ ప్రాంతంలో గతంలో చోటుచేసుకున్నాయి. ఏ చెరువులు, కుంటలు, అడవుల్లోని గుంతలు ఎప్పుడు ఎవరిని బలి తీసుకుంటాయో తెలియని అయోమయం నెలకొంది. సెలవుల్లో విద్యార్థులు, యువత పాలిట ఇవి కాలయముడిలా మారి ప్రాణాలను హరిస్తున్నాయి. నియోజకవర్గంలో గత మూడేళ్లలో ప్రమాదవశాత్తు ఏడుగురు నీళ్లలో మునిగి మృతిచెందారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదకరంగా చెరువులు, గుంతలు...

ఇక గ్రామాల సమీపంలోని పలు చెరువుల్లో ఇటుకల కోసం లేదా ఇతర అవసరాల కోసం అక్రమార్కులు మట్టిని తోడేశారు. చెరువుల్లో ఐదు అడుగులకు మించి మట్టిని తోడరాదనే నిబంధనలున్నప్పటికీ వీటిని ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. ముఖ్యంగా సంబంధిత చెరువు లేదా కుంటల లోతు, లోపలి పరిస్థితుల గురించి అవగాహన లేకుండానే ఈ ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇక నీరు సమృద్ధిగా ఉన్న చెరువుల కింది బావులు, అటవీప్రాంతానికి దగ్గరలో ఉన్న బావులు, కట్టడపురాయి బావుల్లో లోతును అంచనావేయలేకపోవడం, పూడు ఎక్కువగా ఉండడం బావిలోపల పాచి, రాళ్లు, రప్పలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మరోవైపు యువత కోవిడ్ నేపథ్యంలో సరదాగా గడిపేందుకు అడవిలోని కొత్త ప్రాంతాలకు వెళ్లడం, అక్కడున్న వాగుల్లో, చెరువుల్లో స్నానాలకు వెళ్లడం కూడా ప్రమాదాలను కొనితెచ్చుకోవడం జరుగుతోంది. కౌండిన్యలోని కల్యాణరేవులు, గంగన్న శిరస్సులు చాలా ప్రమాదకరమైనవి. జారుడు బండల కారణంగా ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం కొని తెచ్చుకున్నట్లే. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులు పిల్లల పట్ల తస్మాత్ జాగ్రత్తగా ఉండాలి.



కోట్రేపల్లి కొండపై కోనేటిలో మునిగి మృతిచెందిన బాలికలు(ఫైల్)

పారదర్శకంగా పనిచేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజ్

వి.కోట: స్వయం సహాయక సంఘాల పర్యవేక్షణ కోసం పనిచేసే సంఘమిత్రలు, వివో లీడర్లు, సీసీలు పారదర్శకంగా పనిచేయాలని, లేకుంటే స్వచ్ఛందంగా తొలగిపోవాలని ఎంపీపీ యువరాజ్ పేర్కొన్నారు. స్థానిక శ్రీశక్తి భవనంలో ఆదివారం సంఘమిత్రల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అవినీతికి చోటులేకుండా పరిపాలన సాగుతోందన్నారు. దీంతో పేదలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. తోటకనుమలోని సంఘమిత్రపై ఫిర్యాదు అందిందని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డా.తమీమ్‌ఖాన్, మండల సచివాలయ కన్వీనర్ కిషోర్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు భూపతి యాదవ్, ఎంపీటీసీ అరుణాచలం, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

384 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో డీటీఎఫ్ అధికారులు

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని కుక్కలదొడ్డి వద్ద ఓ వ్యక్తి బైక్‌పై 384 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని తెస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు డీటీఎఫ్ సీఐ మాధవస్వామి ఆదివారం తెలిపారు. కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో తాము తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తిని పట్టుకోగా అతని బైక్ వదలి పారిపోయినట్టు పేర్కొన్నారు. ఆ బైక్‌లో మద్యాన్ని గుర్తించి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాగా బైక్‌పై వచ్చిన వ్యక్తిని సెబ్ అధికారులు ఎందుకు పట్టుకోలేదనే విషయంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కోలాహలంగా ఎల్లమ్మ జాతర



ప్రత్యేకలంకరణలో ఎల్లమ్మ

సదుం: మండలంలోని కొత్తపల్లె సమీపంలోని చీనేపల్లె ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం జాతరను కోలాహలంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం మహిళలు చలిపిండి దీపాలు వెలిగించి ప్రత్యేకలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

వైభవంగా గంగమ్మ ఆలయం ప్రారంభం



బురదగుంట గంగమ్మ

పుంగనూరు: మండలంలోని కుమ్మర గుంట గ్రామంలో వైభవంగా శ్రీబురదగుంట గంగమ్మ ఆలయాన్ని ప్రారంభించారు. ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో వేదపండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

ఈశ్వరాలయానికి మంత్రి రోజా విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న మంత్రి ఆర్కే రోజా

- ప్రదోష నంది వాహనం, ఉత్సవమూర్తుల ఏర్పాటు కోసం..
- రూ.2.50 లక్షలు అందజేసిన మంత్రి

పుత్తూరు రూరల్: పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానిక శ్రీకామాక్షీ సమేత సదాశివేశ్వర స్వామి ఆలయానికి విరాళంగా రూ.2.50 లక్షలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ఈ మొత్తంతో ప్రదోష నంది వాహనం, ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ప్రదోష పూజల సమయంలో నంది వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించడం ద్వారా భక్తుల కోరిక నెరవేరినట్లు అవుతుందని తెలిపారు. అయితే మంత్రి రోజా సాయం అందించడంపై పాలకమండలి సభ్యులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.రమేష్‌బాబు, సభ్యులు బాబు, రమేష్, సుందరం, చిట్టిఆచారి, శివ పాల్గొన్నారు.

కల్లూరు లయన్స్ క్లబ్‌కు అవార్డులు



గవర్నర్ లయన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మహ్మదాలి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు లయన్స్ క్లబ్‌కు ఆరు అవార్డులు వచ్చాయని జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడు లయన్ మహ్మదాలీ తెలిపారు. అంతర్జాతీయ లయన్స్ సంస్థ ఆదివారం బెంగళూరులోజరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో కల్లూరు క్లబ్, లియోక్లబ్‌కు గవర్నర్ లయన్ భక్తవత్సలరెడ్డి చేతులమీదుగా ఆరు అవార్డులు ప్రదానం చేశారు. ఉత్తమ రూరల్ క్లబ్‌గా కల్లూరు ప్రథమస్థానం, జిల్లాలో ఉత్తమ లియోక్లబ్‌గా కల్లూరు లియోక్లబ్, ఉత్తమ జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడిగా మహ్మదాలి, ప్రోత్సాహక అవార్డులు లభించాయన్నారు. కార్యక్రమంలో గవర్నర్ వినూత ప్రకాష్, రామరాజ్ ఆర్స్, రాజేష్‌దువా, లియో సభ్యులు హేమంత్, మణికంఠ, కమరలి, మహేశ్వరరెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై నేడు 'స్పందన'

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ వై.రిశాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆర్మడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదం



అన్నప్రసాదం నాణ్యతపై భక్తులను అడిగి తెలుసుకుంటున్న ఆలయ చైర్మన్ అంజూరుశ్రీనివాసులు

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో భక్తులకు నాణ్యమైన అన్నప్రసాదం అందించాలని శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. ఆదివారం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలోని నిత్యాన్నదాన సత్రాన్ని ఆయన పరిశీలించారు. అన్నదానానికి వినియోగించే సరుకులు, కూరగాయలు పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్నప్రసాదం తయారీలో నాణ్యత ప్రమాణాలు ఏ మాత్రం తగ్గకుండా భక్తులకు రుచికరమైన భోజనం అందించాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం భక్తులతో మాట్లాడి సమస్యలేమైనా ఉన్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. దాతలు అన్నదాన పథకానికి విరాళాలు విరివిగా అందజేయాలని కోరారు. జన్మదినాలు, ఇతర ముఖ్య పర్వదినాలను పురస్కరించుకుని దాతలు విరాళాలందించాలని కోరారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 7 వేల మందికి, రాత్రి 2,500 మందికి అన్నదాన ప్రసాదాలు అందజేస్తున్నట్లు తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

పుంగనూరు: టమాట రైతులకు ప్రభుత్వం కిలోకు రూ.20గా నిర్ణయించి ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు టి.జనార్దన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టమాట రైతులు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం తగిన ధరలు చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు.

మన్యం వీరుడు అల్లూరికి నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

పుంగనూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ఆదివారం పుంగనూరులో క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. క్షత్రియ సంఘ నేతలు సుబ్బరాజు, తిరుమలరాజు, నవీన్‌కుమార్ రాజు, లక్ష్మణ్‌రాజు, నారాయణరాజు, సతీష్‌కుమార్‌రాజు, భాస్కర్‌రాజు, మంజునాథ్‌రాజు పాల్గొన్నారు.

క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



క్రికెట్ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవంలో యాజమాన్యం

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులు పాటు జరిగే క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పోటీల్లో 32 జట్లు పాల్గొన్నాయని కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. మొదటి రౌండ్ అనంతరం 16 జట్లు రెండవ రౌండ్‌కు అర్హత సాధించినట్టు తెలిపారు. రెండవ రోజు పోటీలకు ఎంపికైన 16 జట్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. క్రీడాకారులందరూ తమ సమయస్ఫూర్తి పెంపొందించుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఈసందర్భంగా కరెస్పాండెంట్, చైర్మన్ సునీల్ కోరినట్టు తెలిపారు.

జోరందుకున్న ఉపాధి పనులు



బైరెడ్డిపల్లె చెరువు కట్టపై శుభ్రం చేస్తున్న కూలీలు

బైరెడ్డిపల్లె: ఉపాధి హామీ పథకాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరికీ పనులు కల్పించడంతో పాటు వేతనాలు ఎప్పటికప్పుడు కూలీల ఖాతాలకు జమ చేస్తుండడంతో సొంతూరులోనే పనిదొరుకుతుందని కూలీలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. మండల పరిధిలో ఉపాధి పనులు జోరుగా జరుగుతున్నాయి. ఉపాధి పథకం ద్వారా నీటి వనరులు, వాగులు, చెరువుల ఆధునికీకరణ, పంట పొలాల చుట్టూ సరిహద్దులు, కందకాలు, ఇంకుడు గుంతలు వంటి తవ్వకం పనులు చేపడుతున్నారు.

ఇంటర్‌లో ముస్లిం విద్యార్థులకు ఉర్దూ భాష అవకాశం



విద్యార్థులకు ఉర్దూ భాష సద్వినియోగంపై ముస్లిం ప్రతినిధులతో చర్చిస్తున్న సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి

తిరుపతి కల్చరల్: పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్‌లో ఉర్దూ భాష సెకండ్ లాంగ్వేజ్‌గా తీసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం స్థానిక అంజుమన్ తర్‌కీ ఉర్దూ కార్యాలయంలో ముస్లిం ప్రతినిధులతో ఇంటర్‌లో విద్యార్థులకు ఉర్దూ భాష అవకాశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలనతో ప్రజల అభ్యున్నతికి కోసం నిరంతరం కృషిచేస్తున్నారని తెలిపారు. ఉర్దూ భాషను అధికార భాషగా గుర్తించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని ముస్లిం పిల్లలు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముస్లింలు తమ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. అంతేకాక ఇంటర్‌లో సెకండ్ లాగ్వేంజ్‌గా ఉర్దూను తీసుకునేలా ముస్లింలకు అవగాహన కల్పించి ముస్లిం విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ ఫరీద్ సాహెబ్, షేక్ నిసార్ అహ్మద్, ఎస్వీయూ ఉర్దూ విభాగం షేక్ జాకీర్ హుస్సేన్, అంజాద్ అలిబేగ్, సయ్యద్ ఉస్మాన్ ఖాద్రి, షేక్ మున్నార్ పాల్గొన్నారు.

లండన్ కౌన్సిల్ సభ్యుడిగా పుత్తూరు వాసి ఎన్నిక



బ్రాక్‌వెల్ ఎన్నికల్లో గెలుపొందిన మహ్మద్ నాజర్ (పచ్చ కోటు ధరించిన వ్యక్తి)

పుత్తూరు రూరల్: లండన్ దేశంలోని చెందిన బ్రాక్‌వెల్ నగరంలో ఈనెల 4వ తేదీన జరిగిన ఎన్నికల్లో పుత్తూరుకు చెందిన యువకుడు మహ్మద్ నాజర్ విజయం సాధించాడు. స్థానిక షాపువీధికి చెందిన వ్యాపారి జహురుద్దీన్ కుమారుడైన మహ్మద్ నాజర్ 15 ఏళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా లండన్ వెళ్లాడు. ఆదేశ పౌరసత్వం లభించడంతో ఈనెల 4వ తేదీన జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాడు. పుత్తూరుకు చెందిన యువకుడు బ్రిటన్ గడ్డపై ప్రజాప్రతినిధిగా ఎంపిక కావడం పట్ల ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అతని తండ్రి జహురుద్దీన్, బావ వహీద్ అహ్మద్, లతీఫ్, రబీబుల్లా, హమీద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ధర్మ, భక్తి, జ్ఞానమార్గాలు మోక్షానికి దిక్సూచికలు



జ్యోతి ప్రజ్వలన చేసి రామకృష్ణ మిషన్ వార్షిక వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, ఆశ్రమ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ధర్మ, భక్తి, జ్ఞాన మార్గాలు మోక్షానికి దిక్సూచికలని, వాటిని ఆచరించి మానవాళి తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని శ్రీవేంకటేశ్వర వేద వర్సిటీ ఉపకులపతి రాణి సదాశివమూర్తి తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆవరణలో శనివారం శ్రీరామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలోనూ భగవంతుడిని చూసి సేవ చేయాలన్నారు. మానవాళికి సేవ చేసేందుకు ప్రతి నాగరిక దేశంలో ఆశ్రమాన్ని ప్రారంభించాలని రామకృష్ణ మిషన్ అధికారులను కోరారు. కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి భీతి హరానందజీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సేవ చేయడాన్ని అలవర్చుకోవాలని కోరారు. రామకృష్ణ మిషన్ అభివృద్ధిలో శారదా మాత పాత్రపై జి.శ్రీదేవి ఉపన్యసించారు. డాక్టర్ పీసీ రెడ్డి మాట్లాడుతూ భగవాన్ రామకృష్ణ ఆధ్యాత్మికతను, ఆధ్యాత్మిక యాత్రను, ఆయన సేవను మహాత్మా గాంధీ కొనియాడిని విధానాన్ని తెలియజేశారు.

16 నుంచి సంతపేట జాతర



మాట్లాడుతున్న భూపేష్ గోపీనాథ్

చిత్తూరు రూరల్: నగరంలోని సంతపేటలో ఈనెల 16 నుంచి రెండు రోజులపాటు గంగ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ నేత భూపేష్ గోపీనాథ్ తెలిపారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో జాతర నిర్వహణపై సమావేశం నిర్వహించారు. మంగళవారం చాటింపు వేయించనున్నట్లు వెల్లడించారు. 16న జాతర ప్రారంభమవుతుందని, అంబలి సమర్పణ, కుంభ నైవేద్యం, తమిళ వీధి నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. 17వ తేదీ మధ్యాహ్నం దుర్గమ్మ ఆలయం నుంచి గెరిగ తీసుకొచ్చి ఊరేగింపు, ఓం శక్తి భక్తులు విన్యాసాలు ఉంటాయని తెలిపారు.